విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి
20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలంగాణ వాణి కుటుంబ సభ్యులకు 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలంగాణ వాణి పాత్రికేయ కుటుంబ సభ్యులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు



ఎడిటర్
జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 75 | గురువారం 9. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




# 38 మందికి ఉరి

- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష
- 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు





# ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- గోద్రేజ్ అగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం
- ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు
- ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు
- కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని కేటాయింపు
- హైదరాబాద్‌లో జరుగుతున్న గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్

-2026లో పాల్గొనడానికి వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధి బృందం





## గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి శాశ్వత గృహం

- అర్హులైన ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



## మహానేత వైయస్‌కు ఘన మంత్రులు నివాళి

- మహానేత వైయస్ అందించిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయి
- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కేవీపీ ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్

## ముఖ్యమంత్రికి రైతుల కంటే రాజకీయమే ముఖ్యమా?



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మేడిగడ్డ వద్ద వృథాగా లక్షల క్యూసెక్కులు పోతున్నాయి
- నీళ్లు లేక రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. నీటిని వృథా చేస్తారా?
- అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించట్లేదా ?
- ఎల్ నినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు
- పంటలు సాగుచేసే పరిస్థితి లేని ప్రభుత్వమేమో ?

## ధరణి, భూభారతి అక్రమాల డైవర్షన్ కే కాళేశ్వరం డ్రామా



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- ధరణితో పాటు భూభారతిలోనూ అవకతవకలు జరిగాయి
- ధరణితో పాటు భూభారతిపైనా సిట్ విచారణ జరగాలి
- డైవర్షన్ పాలిటిక్స్ కోసమే కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారు
- తాటిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించింది
- ఈ బ్లాక్ ద్వారా సంస్థకు రూ.64 వేల కోట్ల ఆదాయంతో పాటు 1200 అదనపు ఉద్యోగాలు

## సింగరేణి బ్లాక్ లను తెలంగాణకే కేటాయించాలని కిషన్ రెడ్డిని కోరుతున్నాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సింగరేణికి క్లియరెన్స్ అని కిషన్ రెడ్డి చెప్పడం చాలాసంతోషం
- తాడిచెర్ల 2 బ్లాక్ ను 2013 లోనే యూపీఏ గవర్నమెంట్ అలాట్ చేసింది
- ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ ను అలాట్ చేసింది ఏంటని
- సర్వే, డ్రిల్లింగ్, అన్ని చెక్ చేసుకొని సింగరేణి మైనింగ్ లీజు కోసం 2023 దరఖాస్తు చేసింది

## ఈసీ నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇస్తాం.



హైదరాబాద్ తెలంగాణ వాణి) తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు రిజిస్ట్రేషన్ పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు వచ్చిన క్రమంలో ఈసీ కవిత పార్టీకి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈసీ నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇస్తామని ఢిల్లీ హైకోర్టులో రిప్లై ఇచ్చారు టీఆర్ఎస్ పార్టీ అడ్వకేట్. వారం రోజుల్లో సమాధానం ఇస్తామని... ఆ తర్వాత వ్యక్తిగతంగా హాజరై వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ సూచన మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుపై అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని.. రెండు పార్టీల నుంచి వచ్చిన భ్యంతరాలను మాత్రమే తమకు ఈసీ పంపగా వాటికి సమాధానాలు ఇచ్చామని తెలిపారు.

## రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెడితే రాజీనామా చేస్తా

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తుమ్మిడి హట్టి పేరుతో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్లు తిన్నారు
- "తుమ్మిడిహట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి అవసవం
- ఒకవేళ అనుమతి ఇచ్చింది నిజమే అయితే.. రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలి.
- వ్యాప్కోస్‌ను చెఫ్‌తో పోలుస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడారు..
- అసలు వ్యాప్కోస్‌ను తెచ్చిందే కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.
- నీళ్లు నింపుకొనే అవకాశం ఉన్నా ప్రభుత్వం నింపట్లేదు.
- వరంగల్ జిల్లాలో 90శాతం చెరువులు ఎండిపోయాయి.
- గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్‌రెడ్డి నీళ్లను వదులుతున్నారు.
- నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం నేరపూరిత నిర్లక్ష్యం





## పోలీసుల ఫిట్‌నెస్‌కు క్రీడలే బలమైన పునాది

- రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్
- సమయ వృథాగా భావించొద్దు..
- తొలిసారిగా ఐదు క్లస్టర్లలో..
- పదలో ముందుగా గుర్తొచ్చేది పోలీసులే..



## ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకిస్తా?

- కడియంపై చర్యలు తీసుకోవాలని సీఎంకు కొండా లేఖ
- ఆమె లేఖ రాసిన నేపథ్యంలో కడియం స్పందించారు.
- 'కొందరు కొత్త అలవాట్లు నేర్చుకుంటున్నారు.
- కాంట్రవర్సీ చేస్తూ ప్రజల మధ్య ండాలనుకుంటున్నారు.
- దేవాదాయ శాఖ అధికారులతో నేను సమీక్ష నిర్వహించలేదు..
- సమస్యలు విన్నవించా. నా వద్దకు అధికారులను పిలిస్తే అది సమీక్ష అవుతుంది.
- సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సీఎంనూ కలుస్తా"

## పుణెలో కూలిన భవనం.. శిథిలాల కింద 15 మంది!



హైదరాబాద్ తెలంగాణ వాణి) మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలో పుణె జిల్లా పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న ఓ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంటులో మూడంతస్తుల భవనం కుప్పకూలింది. శిథిలాల కింద 15 మంది ఉద్యోగులు చిక్కుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు.. సహాయక చర్యలు చేపట్టాయి.వారం రోజులుగా పుణె, పింప్రి-చించ్వాడ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు.

## ఈ రాత్రికి ఇరాన్‌పై విరుచుకుపడతాం: ట్రంప్



ఇరాన్‌తో ఇటీవల చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు రాత్రి ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించారు. తుర్కియేలో జరుగుతున్న నాటో సదస్సులో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ తీరు బాగాలేదన్నారు. నేడు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉందని చెప్పారు.

# సంపాదకీయం

## సర్ పై సందేహమెందుకు

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియ పట్ల అన్ని పార్టీలు ప్రత్యేక దృష్టి సారించిన విషయం అందరికి తెలిసిందే. అసలు సర్ ప్రక్రియ వల్ల కేంద్రం ఎం ఆశిస్తుందో స్పష్టంగా తెలియనప్పటికీ మనం అందరం అలోచించాల్సిన విషయం ఒకటుంది. సర్ ప్రక్రియ వల్ల ఓటర్ల ఏరివేత ఖచ్చితంగా జరుగుతుంది. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ జరిగింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడ జరగబోయేది కూడా ఇదే. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్, వామ పక్ష పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తు క్షేత్ర స్థాయిలో బూత్ ఇంచార్జిలను నియమించి మరీ సర్ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తున్నాయి. ఇదంత ఎందుకయ్యా అంటే అందరి చూపు పశ్చిమ బెంగాల్ వైపే చూస్తున్నాయ్. ఆ రాష్ట్రంలో ఏకంగా 25 లక్షలలకు పైగా ఓట్లు తొలగించడంతో అన్ని రాజకీయ పార్టీల్లో ఆందోళన మొదలైంది. వీళు ళ్ళ ఆందోళన చెందడంలో ఎలాంటి తప్పు లేనప్పటికి బెంగాల్ పరిస్థితి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఉండదు ఉండబోదు కూడా. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న. సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు, అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉండటం కూడా. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్ళు దాటినప్పటికి ఆంధ్రప్రదేశ్ కు చెందిన వాళ్ళ ఓట్లు తెలంగాణలో కూడా ఉన్నాయి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్ కార్డు, ఒకే పాస్పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్ ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్కార్డులను ఆధార్తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్ అనుసంధానం చేయలానే డిమాండ్ ఎప్పటి నుండో ఉంది. ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. కానీ ఇది కార్య రూపం దాల్చేందుకు రాజకీయ పార్టీలు సహకరించకపోవడం వల్లే ఇప్పుడు సర్ ప్రక్రియ అనివార్యమైంది. డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగింపుకు రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనవసరమైన భయాందోళన రేపి ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ' దైద '

**నకిరేకల్ : జూలై 8 (తెలంగాణ వాణి)**

నకిరేకల్ పరిధిలోని గుడివాడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ లింగయ్య కుమారుడి వివాహ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందరు హాజరై నూతన వధూవరులన ఆశీర్వదించడం జరిగింది.

## జర్నలిస్టులకు బూర్గంపాడు మాజీ జడ్పిటిసి శ్రీలత గౌరవ సత్కారం



**భద్రాచలం జులై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

భద్రాచలం టీయూడబ్ల్యూజె (ఐజెయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్ కి యూనియన్ అధ్యక్షుల ఆహ్వానం మేరకు మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత - రామ కొండారెడ్డి దంపతులు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు జలగం జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా సమాజంపై చూపుతున్న ప్రభావం, సమాచార ప్రసారంలో వేగం, తప్పుడు ప్రచారం, ఫేక్ న్యూస్, బాధ్యతాయుత జర్నలిజం, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రతి వ్యక్తి జీవితంలో భాగంగా మారిన నేపథ్యంలో దాని సానుకూల, ప్రతికూల ప్రభావాలు, ప్రజల్లో మీడియా విజ్ఞానం పెంపు, ఫేక్ న్యూస్‌ను గుర్తించే విధానాలు, బాధ్యతాయుత సమాచార వినియోగం, జర్నలిస్టుల పాత్ర, డిజిటల్ మీడియా భవిష్యత్తు వంటి సమకాలీన అంశాలను వెల్లడించారు. టీయుడబ్ల్యూజె (ఐజెయూ) ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రత్యేక బాధ్యతలు స్వీకరించిన బూర్గంపాడు మండల జర్నలిస్టులను మాజీ జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత రామాకొండ రెడ్డి దంపతులు జర్నలిస్టులకు శాలువాను కప్పి సీతారాముల వారి మెమొంటోని రాముల వారి లడ్డు ప్రసాదాన్ని అందజేస్తూ గౌరవ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టులు, మండల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు

# సైబర్ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయండి

- జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లపై జిల్లా పోలీసులకు ప్రత్యేక శిక్షణ
- వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు







**కొత్తగూడెం, జూలై 7 (తెలంగాణ వాణి)**

సైబర్ నేరాల బాధితులకు వేగంగా న్యాయం అందించడంతో పాటు ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించేలా జిల్లా పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌వోలు), సైబర్ వారియర్స్‌కు గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మాడ్యూల్ (జీఆర్ఎం), మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం) వినియోగంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు మాడ్యూళ్ల వినియోగ విధానం, అమలు ప్రక్రియ, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సైబర్ నేరాల్లో ప్రమేయం లేకపోయినా దర్యాప్తు ప్రక్రియలో బ్యాంకు ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జీఆర్ఎం ద్వారా సంబంధిత బ్యాంకులకు తమ వినతులను సమర్పించుకోవచ్చని అధికారులు తెలిపారు. పరిశీలన అనంతరం నిబంధనల మేరకు అర్హులైన వారి ఖాతాలను డీ-ఫ్రీజ్ చేయడం లేదా ఫ్రీజ్ అయిన నగదును విడుదల చేసే చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోల్పోయిన నగదును త్వరితగతిన తిరిగి అందించడంలో ఎంఆర్ఎం మాడ్యూల్ కీలకంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రూ.50 వేలలోపు ఫ్రీజ్ అయిన అర్హత కలిగిన మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు లేకుండానే నిబంధనల ప్రకారం పరిశీలించి బాధితులకు తిరిగి అందించే అవకాశం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్ జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లను సమర్థవంతంగా వినియోగించి ప్రజల వినతులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. బ్యాంకులు, దర్యాప్తు అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగించి సైబర్ నేరాల బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు, సైబర్ వారియర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న**

**పాల్వంచ, జూలై 8 (తెలంగాణ వాణి)**



జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం దంతల బోరు గ్రామంలో మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు, రైతు భరోసా నిధుల విడుదల సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు భువన సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథిగా హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవి ప్రసన్న మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ కావడం ఎంతో సంతోషకరమని, రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు బిడ్డ అని, రైతే రాజు అని నమ్మిన నాయకుడని కొనియాడారు. ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో రైతుల కష్టాలు తీర్చారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలనే నేడు సీఎం రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎకరాకు రూ 12, వేలు సహాయం అందుతోంది. విత్తనాలు వేసే సమయంలోనే డబ్బు అందడం వల్ల రైతుకు పెద్ద ఊరట లభించింది. ఇది కాంగ్రెస్ పార్టీ రైతులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం" అని తెలిపారు. వైఎస్ఆర్ చూపిన రైతు సంక్షేమ మార్గంలోనే ప్రభుత్వం నడుస్తోందని, జిల్లాలోని ప్రతి రైతుకు రైతు భరోసా, ఇందిరమ్మ రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎస్.ఐ.ఆర్ అబ్జర్వర్ లింగోజి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. ప్రసాద్ బాబు, మంద హనుమంతు, జిల్లా కోశాధికారి కొదుమూరి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దెల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, పెద్దమ్మ గుడి మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, మహీపర్తి రామలింగం, రైతు కాంగ్రెస్ నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బీఎంఎస్ కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం చారి

## ప్రతిపక్ష అనుబంధ యూనియన్ కార్యక్రమంలో జిఎం హాజరుపై ఆసక్తికర చర్చ

**భద్రాద్రి బ్యూరో సింగరేణి, జూలై 8 (తెలంగాణ వాణి)**





సింగరేణి చరిత్రలో తొలిసారిగా ప్రతిపక్ష అనుబంధ కార్మిక సంఘం నిర్వహించిన కార్యక్రమంలో జీఎం స్థాయి అధికారి పాల్గొనడం సింగరేణి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాకులను సింగరేణికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన సందర్భంగా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం బీఎంఎస్, ఏబీకేఎంఎస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్, ఏబీకేఎంఎస్, బీజేపీ నాయకులు పాల్గొనగా జై బిఎంఎస్, జై జై బిఎంఎస్ నినాదాల మధ్య సింగరేణి ఎడ్యుకేషన్ (జీఎం) వెంకటాచారి పాలాభిషేకం ప్రారంభించడం ప్రత్యేక చర్చకు దారితీసింది. సాధారణంగా కార్మిక సంఘాల కార్యక్రమాలకు, ముఖ్యంగా రాజకీయ అనుబంధ యూనియన్ల నిర్వహించే కార్యక్రమాలకు జీఎం స్థాయి అధికారులు హాజరుకావడం సాధారణ విషయం కాదని సింగరేణి ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న బీజేపీ అనుబంధ యూనియన్ కార్యక్రమంలో జీఎం స్థాయి అధికారి పాల్గొనడంపై ఉద్యోగులు, కార్మిక సంఘాల్లో విస్తృత చర్చ సాగుతోంది.

# పోలీసుల ఫిట్‌నెస్‌కు క్రీడలే బలమైన పునాది



విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి గురయ్యే పోలీసుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఆవశ్యకమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్ వెల్ఫేర్ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2026 బుధవారం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఆర్ఎస్ఐ గోవిందరెడ్డికి స్పోర్ట్స్ టార్చ్‌ను అందజేసి డీజీపీ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు.

**సమయ వృథాగా భావించొద్దు..**

ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ.. “నాకు గోల్ఫ్ ఆడటం ధ్యానం చేసినంత ప్రశాంతతను ఇస్తుంది. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా క్రీడలు నాకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నేను ఒకరోజు పోలీసింగ్‌ను ఆపవచ్చేమో కానీ.. క్రీడలు ఆడటం మాత్రం ఎప్పటికీ ఆపను. క్రీడలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమయ వృథాగా భావించవద్దు” అని అన్నారు. ప్రతి యూనిట్‌లోని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. గతేడాది అఖిల భారత పోలీస్ క్రీడల్లో తెలంగాణ బృందం 21 పతకాలు సాధించిందని, ఆ సంఖ్యను, ముఖ్యంగా బంగారు పతకాలను మరింత పెంచేలా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**తొలిసారిగా ఐదు క్లస్టర్లలో..**

గత 35 ఏళ్లుగా రాష్ట్ర పోలీస్ క్రీడలను ఒకే వేదికపై నిర్వహించే ఆనవాయితీకి ఈ ఏడాది స్వస్తి పలికినట్లు డీజీపీ వెల్లడించారు. జాతీయ స్థాయి స్పోర్ట్స్ తరహాలో.. ఐదు క్లస్టర్లుగా విభజించి ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరింత మంది సిబ్బందికి క్రీడల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. మొత్తం 21 జట్లతో 34 ఈవెంట్లలో పోటీలు జరగనున్నాయి. క్లస్టర్ ఏ పోటీలు జులై 7 నుంచి 9 వరకు సరూర్‌నగర్‌లో బాక్సింగ్, రెజ్లింగ్ తదితర 14 ఇండోర్ క్రీడలు, క్లస్టర్ బీ టీ20 క్రికెట్ పోటీలు నవంబర్ 17 నుంచి 19 వరకు ఫ్యూచర్ సిటీలో జరగనున్నాయి. క్లస్టర్ సీ పోటీలు టెన్నిస్, బ్యాడ్మింటన్ సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు తెలంగాణ పోలీస్ అకాడమీలో, క్లస్టర్ డీ వాలీబాల్,కబడ్డీ నవంబర్ 3 నుంచి 5 వరకు, క్లస్టర్ ఈ సైక్లింగ్, ఆర్చరీ, రోయింగ్, నవంబర్ 25 నుంచి 28 వరకు నిజామాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక శిక్షణ, కోచింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ. 3 లక్షల నగదు బహుమతితో పాటు మూడు ప్రత్యేక ఇంక్రిమెంట్లు, వెండి పతకం సాధిస్తే రూ. 2 లక్షల నగదు, రెండు ప్రత్యేక ఇంక్రిమెంట్లు, కాంస్య పతకం నెగ్గితే రూ. లక్ష నగదు బహుమతి సహా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను అందజేస్తామని ప్రకటించారు.

**ఆపదలో ముందుగా గుర్తొచ్చేది పోలీసులే..**

ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా దేవుడు, ఆ తర్వాత పోలీసులే గుర్తుకు వస్తారని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సీపీ సుమతి,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐజీ గజారావు భూపాల్‌తో పాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు, పోలీసు క్రీడాకారులు, పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ విద్యార్థులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## సేవా కార్యక్రమాలతో నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నిర్మల్--భైంసా, జూలై 08:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి 56వ జన్మదిన వేడుకలను బుధవారం భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 100 మంది రోగులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.అనంతరం వివేకానంద అనాథాశ్రమంలోని చిన్నారులకు బియ్యం,నూనె,పప్పులు, కూరగాయలు తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి విద్యారంగంలో లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వీఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## ముధోల్ నియోజక వర్గ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్,ఎస్ఐ శిక్షణ

**నిర్మల్ - భైంసా: జూలై 08 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ముధోల్ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ కానిస్టేబుల్, సబ్ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన కోచింగ్, పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ముధోల్ నియోజకవర్గానికి చెందిన ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణలో పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ అమలులో లోపాలు సరిదిద్దాలి

### ఓటర్లకు అవగాహన కల్పించాలి: బీజేపీ నేత బలరాం

**పటాన్‌చెరు, జూలై 8 (తెలంగాణ వాణి):**



ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలులో ఉన్న లోపాలను సరిదిద్దాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు, శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాం ప్రభుత్వాన్ని, న్నికల సంఘాన్ని కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ దరఖాస్తుల నింపే ప్రక్రియపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్‌లో అదనపు అధికారిని నియమించి, ప్రభుత్వ సిబ్బంది ఆధ్వర్యంలో దరఖాస్తులు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫారాల్లో పొరపాట్ల కారణంగా అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఓటర్లకు పూర్తి సహకారం అందించి ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రైతు పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ కి పాలాభిషేకం



**రాజపేట జూలై: 08(తెలంగాణ వాణి విలేకరి)**
రైతు పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం ఈ ప్రజా ప్రభుత్వానికి రాజపేట మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రైతుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి కి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఫ్లెక్సీ కి పాలాభిషేకం చేశారు.
ఈ కార్యక్రమంలో రాజపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నమిలే మహేందర్ గౌడ్ బుడిగ పెంటయ్య గౌడ్ మార్కెట్ కమిటీ ఆలేరు డైరెక్టర్ సిల్వర్ బాలరాజ్ గౌడ్ విట్టల్ నాయక్ యాదాద్రి జిల్లా సెక్రెటరీ సురేందర్ రెడ్డి పిట్టల జయరాములు ఇంజనరేష్ మెండు భాస్కర్ రెడ్డి సర్పంచుల పోరం అధ్యక్షుడు రంగ నరేష్ రాజపేట ఉప సర్పంచ్ కేదారి గౌడ్ బల్ల మహేష్ కోర మల్లయ్య లక్ష్మణ్ సునీల్ కాసుల భాను రెడ్డి డాక్టర్ చింతల రవీందర్ రేగు సిద్దులు బిరు లవన్ సిద్ధులు గుర్రం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పెద్దమందడి విద్యార్థి ఎంపిక

**వనపర్తి : జులై 8, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఈనెల 9,10,11 తేదీలలో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ హాకీ పోటీలకు పెద్దమందడిలో పదవ తరగతి పూర్తి చేసిన పి.శివశంకర్ ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యంయాదవ్ తెలిపారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో చక్కటి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని, మన రాష్ట్రానికి, జిల్లాకు ,గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని , ఏఎంసి చైర్మన్ మహేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి, ఉపసర్పంచ్ ఉషన్న, గ్రామ పెద్దలు , ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

# విద్యాశాఖపై విస్తృత స్థాయి సమీక్ష

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జులై : 08 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ప్రగతి, పాఠశాలల్లో వసతుల కల్పన, పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును 30 శాతం పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగడానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిజిటల్ విద్యా విస్తరణలో భాగంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్లు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అనంతరం పదవీవిరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో సత్కరించి పదవీ విరమణకు సంబంధించిన మెమంటో పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు, డీఈఓ మాధవి, డీఆర్‌డీఓ రవీందర్, మండలాల విద్యాశాఖాధికారులు, సెక్టోరల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రణ దివ్యానగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, జులై : 08 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా రణ దివ్యానగర్ ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజామున నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 107 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, ఒక కారు, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న 16 వాహనాలను స్వాధీనం చేసుకొని, (బి. ఎన్. ఎస్ ) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు మత సామరస్యాన్ని కాపాడాలని, సామాజిక మాధ్యమాలు లేదా బహిరంగ ప్రదేశాల్లో గొడవలకు, విద్వేషాలకు దారితీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిలో జోక్యం చేసుకోకుండా వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవించేలా జీవించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాంబ్లే సుభాష్ వద్ద నుంచి 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, సీఐలు బి.డి. ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎస్సైలు వి. విష్ణువర్ధన్, ఎస్. జీవన్ రెడ్డి, విష్ణు ప్రకాష్, హారుణ్తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులను అభినందించిన సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

**హుస్నాబాద్ జులై 08 (తెలంగాణ వాణి ఆర్ సి)**




సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవీందర్ రెడ్డి హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అ అధ్యాపకేతర బృందంతో సమావేశం నిర్వహించి ఈ విద్యా సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. గత సంవత్సరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలుపుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినుల కు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం మధ్యాహ్న భోజనం కల్పిస్తుందని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యార్థుల శ్రీ విద్యాధికారి కె.రవీందర్ రెడ్డి తెలిపారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థినిలు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని తెలిపారు. అనంతరం జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటజిల్లాఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవీందర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలకు కళాశాల ప్రిన్సిపల్ వి.లలిత అధ్యక్షత వహించడం జరిగింది. ప్రభుత్వ బాలికల కళాశాల హుస్నాబాద్ లో ప్రిన్సిపాల్ గా పని చేసిన నల్ల రామచంద్ర రెడ్డి యొక్క రికార్డుల పరిశీలనకు స్క్రూటీని కమిటీలుగా నియమితులైన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల హుస్నాబాద్ ప్రిన్సిపల్ సిహెచ్ గంగాధర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల చేర్యాల ప్రిన్సిపల్ జ్యోతి రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లలిత, హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ గంగాధర్, చేర్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, ,సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపక బృందం డి.రవీందర్,ఎస్.సదానందం,టి. నిర్మలాదేవి, బి లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కర్ణాకర్, ఏ.సంపత్, ఎస్ కవిత, కే.స్వరూప, జి కవిత, ఆస్మా పిర్దోస్, ఓ. రాణి, అధ్యాపకేతర బృందం జూనియర్ అసిస్టెంట్లు కె. గీతాంజలి, ఎస్ రాములు, రికార్డ్ అసిస్టెంట్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**కొమురవెల్లి జూలై.8(తెలంగాణ వాణి ప్రతినిధి)**



జనగామ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇం చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆదేశానుసారం బుధవారం రోజు సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు మెరుగు శ్రీనివాస్ సానాది భాస్కర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ఆ మహానేతకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమం, ఉచిత విద్యుత్, ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా ప్రోత్సాహం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజలనే తన కుటుంబంగా భావించి, వారి సంక్షేమమే పరమావధిగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత ప్రజానాయకుడిగా ఆయనను కొనియాడారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావం, మానవతా దృక్పథం నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురువన్నపేట సర్పంచ్ బుడిగే జహంగీర్, ఐనాపూర్ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ, మర్రిముస్త్యాల సర్పంచ్ జంగని రవి, కొమురవెళ్ళి గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు, కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య, సేవాదళ్ అధ్యక్షులు బుడిగే అశోక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులు, మండల కార్యదర్శి స్వాములపల్లి రమేష్, చింతల పరశురాములు, ఐనాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లం బాలయ్య, లెనిన్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు సానాది నాగరాజు, దొడ్ల విష్ణుమూర్తి,మాట్ల మురళీ,మాట్ల శ్రీనివాస్,నరేడ్ల బాల్ రెడ్డి, ఈగ కనకరాజు,మల్లం శేఖర్, శ్రావణ్ కుమార్,దండు నర్సింహులు, భద్రిరాజు, దుర్గయ్య మల్లేశం,సిలివేరి మల్లేశం, తాడూరి రమేష్, తాడూరి రవి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ చింతల రమేష్ రాజ్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ జులై 8( తెలంగాణ వాణి ప్రతినిధి)**



రైతు భరోసా నిధుల విడుదలను స్వాగతిస్తూ కొండమల్లేపల్లి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం" చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలంగాణ రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపిస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు.రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్న సందర్భంగా ఉదయం కొండమల్లేపల్లి చౌరస్తాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత కూడా పాల్గొని రైతు భరోసా నిధుల విడుదలను స్వాగతించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, రైతు చెమటకు విలువ తెలిసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. గతంలో రైతులు పంట పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఇప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేలా రైతు భరోసా నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తూ ప్రభుత్వం రైతు కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతుల శ్రేయస్సే రాష్ట్ర అభివృద్ధికి మూలాధారమనే నమ్మకంతో ప్రతి నిర్ణయం తీసుకుంటోందన్నారు. రైతు భరోసా నిధుల విడుదల, రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు, సాగునీటి వసతుల మెరుగుదల, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతును కేవలం ఓటరుగా కాకుండా దేశానికి అన్నదాతగా గౌరవించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతు కుటుంబం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతు సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త దిశను చూపుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతు భరోసా నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## దివంగత సీఎం వైఎస్ఆర్ సేవలు మరువలేనివి బసవలింగప్ప స్వామి

### గ్రామీణ అర్చకులకు అండగా నిలిచిన ధూపదీప నైవేద్యం పథకం

**పటాన్ చెరు, పాపన్న పేట, జూలై 8, (తెలంగాణ వాణి రిపోర్టర్)**

వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ధూపదీప నైవేద్యం పథకాన్ని ధూపదీప నైవేద్యం అర్చకుల సంఘం నాయకులు స్మరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడు బడిన దేవాలయాల్లో కనీసం నిత్య ధూపదీప నైవేద్యాలు నిర్వహించలేని పరిస్థితులు ఉన్న సమయంలో, అర్చకులకు చేయూతనిస్తూ దేవాలయాల్లో నిత్య కైంకర్యాలు కొనసాగాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. ఈ పథకం అమలై నేటికి 19 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అర్చకులు వైఎస్ఆర్ సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ధూపదీప నైవేద్యం అర్చకుల సంఘం సభ్యులు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ధూపదీప నైవేద్యం అర్చకుల ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గౌరవ వేతనాన్ని పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ధూప దీప నైవేద్యం అర్చకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవ లింగప్ప స్వామి విజ్ఞప్తి చేశారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

## జగన్నాథ రథయాత్రకు భక్తులు తరలిరండి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పిలుపు...



**నిజామాబాద్ జూలై 08: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఇస్కాన్ జగన్నాథ రథయాత్రకు భక్తులు భారీగా తరలిరావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఇస్కాన్ కంటేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నగరంలోని కంటేశ్వర్ ఆలయం నుంచి ఈ నెల 24న రథయాత్ర ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించే రథయాత్రలో ఇందూరు భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే..పరిమితమైన ఇస్కాన్ సేవలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయని కొనియాడారు. నీలకంఠేశ్వరాలయం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర నగరంలోని ప్రధాన వీధుల గుండా తిరిగి కంటేశ్వర్ లోని శ్రీరామ గార్డెన్ కు చేరుకుంటుందన్నారు. ఇస్కాన్ కంటేశ్వర వ్యవస్థాపక అధ్యక్షుడు రామానంద రాయి గౌరదాస ప్రభు జి, నిత్య చాంద్ ప్రభుజి, బలరాం ప్రభు జి, బిజెపి కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, సీనియర్ నాయకులు స్వామి యాదవ్, రఘుపతి గౌడ్, రోహిత్ ప్రబుజీ, సునీల్ ప్రభు జి, భార్గవ్ ప్రభుజి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా నియామకం



**వనపర్తి : జులై 8, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా వనపర్తి పట్టణానికి చెందిన ధ్యారపోగు సుబ్రమణ్యం ను నియమించారు. ఈ సందర్భంగా బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని జిల్లా అధ్యక్షులు సూచించారు. ద్యారపోగు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్, పట్టణ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, పట్టణ దళిత మోర్చా అధ్యక్షులు ఆగపోగు చాణిక్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రీ ధ్యారపోగు సుబ్రహ్మణ్యంకి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలి:

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్,జూలై 08 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్, నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లు నింపి, తిరిగి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలికరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇంటికి వెళ్లి, నింపిన ఫారములను తిరిగి తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సూపర్వైజర్లు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారములు నింపుతున్న తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉంటే, హెల్ప్ డెస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్పష్టత, ఆత్మ విశ్వాసాలతో విజయం తథ్యం

### ప్రాంగణ నియామకాల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు టీఎంసీజీ డైరెక్టర్ మార్గదర్శనం

**పటాన్ చెరు, జులై 8, (తెలంగాణ వాణి రిపోర్టర్)**

: హెచ్ఆర్ ఇంటర్వ్యూలో విజయం సాధించడం అంటే పరిపూర్ణమైన సమాధానాలు ఇవ్వడం కాదని, స్పష్టత, ఆత్మవిశ్వాసం, లక్ష్యంతో స్పందించడమేనని శిక్షణ, మార్గదర్శకత్వం, కెరీర్ గైడెన్స్ (టీఎంసీజీ) సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ స్పష్టీకరించారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలోని 2027 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యార్థుల కోసం 'హెచ్ఆర్ ఇంటర్వ్యూ ప్రశ్నలపై పట్టు సాధించడం' అనే అంశంపై బుధవారం ఆమె కెరీర్ కు సిద్ధం చేసే కార్యక్రమాన్ని ఆన్ లైన్లో నిర్వహించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలోని టీఎంసీజీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి డాక్టర్ మాథ్యూ మాట్లాడుతూ, ఒక బలమైన రెస్యూమే ఇంటర్వ్యూ అవకాశాన్ని కల్పించ గలిగినప్పటికీ, ఒక అభ్యర్థికి తుది ఉద్యోగ ఆఫర్ లభిస్తుందా, లేదా అనేది తరచుగా హెచ్ఆర్ రౌండే నిర్ణయిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆహెచ్ఆర్ ఇంటర్వ్యూల సమయంలో రిక్రూటర్లు నిజంగా ఏమి చూస్తారో అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు సహాయపడటంపై ఈ ముఖాముఖి కార్యక్రమం దృష్టి సారించింది. ఇందులో సమర్థవంతమైన స్వీయ పరిచయాలు, బలాలు, బలహీనతలు, విజయాలు, కెరీర్ లక్ష్యాలపై సాధారణంగా అడిగే ప్రశ్నలకు సమాధాన మిచ్చే వ్యూహాలు, ఆత్మవిశ్వాసంతో మాట్లాడే పద్ధతులు, ఇంటర్వ్యూ పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేసే సాధారణ తప్పుల వంటి అంశాలను చర్చించారు. విద్యార్థులు తమ స్వభావానికి అనుగుణంగా సహజ సిద్ధంగా వ్యవహరించాలని, తమ ఆకాంక్షలను సమర్థవంతంగా వ్యక్తీకరించాలని, ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని డాక్టర్ మాథ్యూ ప్రోత్సహించారు. సాంకేతిక నైపుణ్యం అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని, అయితే సంభాషణా నైపుణ్యాలు, సరైన వైఖరి అభ్యర్థులకు వాటిని దక్కించుకోవడంలో సహాయపడతాయని ఆమె పునరుద్ఘాటించారు.ఈ సెషన్ ఆసక్తికరమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ముగిసింది. దీనిలో విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, నియామక ప్రక్రియపై ఆచరణాత్మక అవగాహన పొందారు. ఈ కార్యక్రమం తమ ఇంటర్వ్యూ సన్నద్ధతను మెరుగుపరిచినందుకు, రాబోయే ప్రాంగణ నియామకాల కోసం ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేసినందుకు, ఇందులో పాల్గొన్న విద్యార్థులు కృతజ్ఞతలను తెలియజేశారు.




# పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

### అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూలై 08 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్ లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు, తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింకు రోడ్లు, సీ.సీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగు నీటి సరఫరా పర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ లు, కార్యదర్శులు పరస్పర సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, తద్వారా సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్దేశిత పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చని సూచించారు. ఏ గ్రామానికి ఏం అవసరం ఉంది అన్న





వివరాలను ప్రభుత్వం తెలుసుకునేందుకు, తద్వారా అవసరమైన నిధులు, తగిన వనరులను సమకూర్చేందుకు గ్రామ పంచాయతీల సమగ్ర ప్రణాళిక దోహదపడుతుందని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తిస్తూ, 2026 -- 2029 కాల పరిమితితో కూడిన మూడు సంవత్సరాలకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని అన్నారు. అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని హితవు పలికారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకు వెళ్తే పల్లెలన్ని సంపూర్ణ ప్రగతితో వికసిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎం.పి.డి.ఓలు, ఎం.పి.ఓలు, సర్పంచ్ లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నూతనకల్ పిహెచ్సిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్

### వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు పీహెచ్‌సీ రిపేర్లకు రూ.14.30 లక్షలు

**నూతనకల్ జులై 8 (తెలంగాణ వాణి జిల్లా బ్యూరో )**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. నూతన్ కల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతనంగా నిర్మిస్తున్న సబ్ సెంటర్ భవనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్ని ఏఎన్సీ కేసులు నమోదయ్యాయి? పీహెచ్‌సీలో ఎన్ని డెలివరీలు చేశారు? అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఫీవర్ సర్వే జరుగుతుందా? ఎన్ని జ్వర కేసులు నమోదయ్యాయి? అని ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య



కేంద్రంలోని జనరల్ వార్డు, లేబర్ రూమ్, ఫార్మసీ, మెడికల్ ఆఫీసర్ రూమ్, మీటింగ్ హాల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి శుభ్రతపై పలు సూచనలు చేశారు. మెడిసిన్ స్టాక్ రికార్డ్, ఏఎన్సీ రిజిస్టర్, బర్త్ ప్లాన్ రిజిస్టర్లను స్వయంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ అప్‌డేట్‌గా ఉండాలని ఆదేశించారు. మరమ్మతుల కోసం నిధుల మంజూరు పీహెచ్‌సీ భవనం పరిస్థితిని గమనించిన కలెక్టర్ రిపేర్ల కోసం తక్షణమే రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి అదనంగా పీహెచ్‌సీ వద్ద ఉన్న రూ.4.30 లక్షల నిధులను కూడా భవన మరమ్మతులకే వినియోగించు కోవాలని సూచించారు. వెంటనే జేఏఎస్ మీటింగ్ నిర్వహించి, పనులు ప్రారంభించాలని మెడికల్ ఆఫీసర్, పంచాయతీ రాజ్ ఏఈని ఆదేశించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.కార్యక్రమం లో ఆర్డిఓ వేణు మాధవరావు, మెడికల్ ఆఫీసర్ ఆశ్రత రెడ్డి, సిహెచ్ఓ చరణ్, నూతనకల్, తాసిల్దార్ శ్రీనివాసరావు మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

### విగ్రహానికి నివాళి.. అన్నదాన కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, జూలై 8 (తెలంగాణ వాణి):**

మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ప్రగతి నగర్‌లోని వైఎస్సార్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

- ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూలై 08 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జిల్లా పంచాయతీ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా మంజూరు చేయాలని తెలిపారు. మండలాల వారీగా గృహాల నిర్మాణ పురోగతిని ఎంపీడీవోలతో సమీక్షించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి, ఇళ్ల నిర్మాణం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ తప్పనిసరిగా చేపట్టాలని



ఆదేశించారు. చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి సేంద్రియ ఎరువుల తయారీతో పాటు ఇతర ఆదాయ వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని, స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులపై నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రజలు, వ్యాపారుల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి వారం రెండు రోజుల పాటు డ్రై డే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గతంలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం నిర్వహించాలని సూచించారు.వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, ఇందుకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే ఫామ్ పాండ్ల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## తెల్లాపూర్‌లో ఘనంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



**తెల్లాపూర్ జూలై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
దివంగత ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా తెల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన ప్రజాసేవను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు సి.పి. రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ వజీద్, సుధాకర్ రెడ్డి, ధరణి రాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అక్రమ్, యువ కాంగ్రెస్ నాయకులు మహేష్, ప్రశాంత్, విక్రమ్, కొల్లూరు శ్రీనివాస్, భుజంగ్ రెడ్డి, అరుణ్ రెడ్డి మండాది, జాషువా జీ, బ్లావు మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.

## డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి 77వ జయంతి వేడుకలు



**చౌటుప్పల్, జూలై 8(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో రాజీవ్ స్మారక భవనంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు, ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండి ఖయ్యూం వై.ఎస్.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామ్ చందర్, నల్ల నరసింహ, సుర్వి నరసింహ గౌడ్, ఆవుల యేసు యాదవ్, కచ్చర్ల జగ్గయ్య, మాదాని గోపాల్, ఎండి అజాజ్, చాంద్ పాషా, ముత్యాల గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ సీఐ పులి వెంకట్ జన్మదినం సందర్భంగా ఘనంగా శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**జమ్మికుంట, జూలై 8, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీసు సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంతాటి రవీందర్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ పులి వెంకట్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపుతున్న నిబద్ధత, సేవా దృక్పథం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ అభినందనీయమని జర్నలిస్టులు కొనియాడారు. ఇదే సేవాభావంతో ముందుకు సాగుతూ ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ పులి వెంకట్ మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, చట్టబద్ధమైన, పారదర్శకమైన పోలీసు సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎం.ఏ. రషీద్, కొంగల కుమార్, బుర్ర కుమార్ తదితరులు పాల్గొని సీఐ పులి వెంకట్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉపసర్పంచ్‌ల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

**-రాష్ట్ర ఫోరం పిలుపు**

**-ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు,**

**మందోళ్ల గూడెం ఉపసర్పంచ్ సూర్కంటి శ్రీధర్ రెడ్డి**



**చౌటుప్పల్, జూలై 8(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
భువనగిరి పట్టణ సమీపంలోని హోటల్ సంకల్పలో బుధవారం ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జూన్ 25న నిర్వహించిన "హలో ఉపసర్పంచ్ – – చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌లకు రాష్ట్ర అధ్యక్షులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉపసర్పంచ్‌ల హక్కులు, అధికారాల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగించాలని, రాష్ట్రంలోని ప్రతి ఉపసర్పంచ్‌కు ఉపసర్పంచ్‌ల ఫోరం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మజ్జిగ నరేష్, గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కటికం స్వప్న, దుస్సా కుమార్, జంపన్న, మట్ట శ్రీను, చిన్నం బాల్‌రాజు, జిల్లా నాయకులు దండ నరేష్, మహేష్, రాజు, ప్రవీణ్, అనిల్, స్వామి, హరీష్, ప్రదీప్, విజయ్, భాస్కర్ నాయక్, వీరన్నతో పాటు మండల ఫోరం అధ్యక్షులు గౌడటి సత్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి శాశ్వత గృహం

- **అర్హులైన ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**
- **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వనపర్తి : జులై 8, (తెలంగాణ వాణి బ్యూరో) :**
ఎదవాడికి అండగా ఉంటారని, పేదల అభ్యున్నతికి అంకిత భావంతో పాటు పడతారని రాష్ట్ర ప్రజలు నమ్మి ఈ ప్రభుత్వాన్ని బలపరిచిందని, ప్రజల నమ్మకాన్ని తల తాకట్టు పెట్టి అయిన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకు రావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం వనపర్తి జిల్లాలో పర్యటించి సహచర మంత్రులు రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గుడిసెల్లో నివసించే పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూ, రాష్ట్రంలో గృహరహితులు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మూడు లక్షల 50 వేల ఇండ్లు మొత్తంగా 8 లక్షల ఇండ్లు పేదలకు కట్టిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో పేదలు ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అత్యంత పారదర్శకంగా వారి ఖాతాలోనే డబ్బులు పడే విధంగా అమలు చేస్తు న్నామని ఇది ఎంతో గొప్ప విషయమని తెలిపారు. హైదరాబాద్ నుంచి బటన్ నొక్కితే నేరుగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతున్నాయని తెలిపారు. ఇంతకు ముందు ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు సైతం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు మతి భ్రమించి మాట్లాడు తున్నాయని, గత ప్రభుత్వం 8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీని గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రైతును రాజు చేయాలనే సంకల్పంతో రైతులందరికీ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. పెట్టుబడి సాయం కింద రైతులకు ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున 9,300 కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ కూడా అందిస్తున్నట్లు తెలియజేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఇక ఉద్యోగాల విషయానికొస్తే ఇప్పటికే 72,000 ఉద్యోగాలను భర్తీ చేశామని త్వరలోనే మరో 22 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు మేఘారెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. పేద ప్రజలకు కుటుంబ సభ్యుడిగా ఉండి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. మేఘా రెడ్డి నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గానికి కేవలం ఇందిరమ్మ ఇండ్లకే రూ.275 కోట్లు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. వనపర్తికి రెండో విడతలో భాగంగా 2000 ఇందిరమ్మ ఇండ్లను



మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.
స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా వనపర్తి నియోజకవర్గంలో సబ్ రిజిస్టర్ భవనాన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వనపర్తి నియోజకవర్గ కేంద్రంలో జర్నలిస్టుల కోరిక మేరకు ప్రెస్ క్లబ్ భవనం సైతం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక, మట్టి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటి విషయంలో పేదలను ఇబ్బంది పెట్టకుండా ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించి లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తుల విషయంలో ప్రతి అప్లికేషన్ వెరిఫై చేసి పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. సాదా బైనామ ఉండి పొజిషన్ లో ఉన్న రైతులకు రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే ఉన్న పథకాలను ఏమాత్రం తీసివేయకుండా వాటికి అదనంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు అత్యంత పారదర్శకంగా కొనసాగుతున్నాయని ప్రశంసించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వేగంగా తమ ఇండ్లను నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. అయితే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలు లబ్ధిదారులు తమకు నిర్దేశించిన పరిమితుల్లోనే ఇల్లు కట్టుకోవాలని, అప్పులు చేసి ఇండ్లు కట్టవద్దని సూచించారు. వనపర్తి నియోజకవర్గంతో పాటుగానే కొల్లాపూర్ నియోజక వర్గానికి అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పొంగులేటిని కోరారు. ప్రభుత్వంపై కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. అంతేకాకుండా రూ. 8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని మంత్రి విమర్శించారు. అప్పుల భారం ఎంత ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, వేల కోట్ల రూపాయలు వెచ్చించి రైతు రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడం, వారి కలల్ని సాకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి బాలేనప్పటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. సుమారు రూ.60 వేల కోట్ల రూపాయలతో మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల పాలు చేసారని విమర్శించారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గుడిసెల్లో నివసించే కుటుంబాలందరికీ శాశ్వత గృహం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో వనపర్తి నియోజకవర్గంకు 2 వేల





ఇండ్లు మంజూరు చేయడం ఆనందకరమని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు గుడిసెల్లో నివసించే అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతేడాది వనపర్తి కి సీఎం వచ్చినప్పుడు వనపర్తి నియోజకవర్గలో రూ.1,000 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారని, ఇప్పటి వరకు రెండున్నర ఏళ్ళలో దాదాపు 2200 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసుకోవడం జరిగిందని తెలిపారు.
ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా మరో 2000 ఇళ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా జిల్లాలోని 32 ఎస్టీ హ్యాబిటేషన్లకు ప్రతి హ్యాబిటేషన్ కు 20 ఇళ్ల చొప్పున మరో 640 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వనపర్తి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయా భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెబ్బేరు (=వజవఅబవ ణఅజఅంఅశీఖుశ్రీ) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ లో ఉన్న వనపర్తి బైపాస్ రహదారి నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు వనపర్తి లో ప్రెస్ క్లబ్ మంజూరు చేయాలని కోరారు. మర్రికుంటలో భూములు కోల్పోయిన రైతులకు ఎన్ ఓ సీ ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. వనపర్తి లో క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ స్కూల్, హాకీ టర్ఫ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టిన క్రీడల మంత్రికి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి కు ధన్యవాదములు తెలిపారు. టూరిజం శాఖ తరపున రూ. 12 కోట్లు, సంస్కృతిక శాఖ తరపున రూ. 1 కోటి వనపర్తి అభివృద్ధి కి కేటాయించినదుకు మంత్రి జూపల్లికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు శాశ్వత నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.
వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. వనపర్తి నియోజకవర్గానికి మరో రెండు వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మంత్రికి కోరారు. అనంతరం మంత్రులు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ రాములు

**మంచిర్యాల, జూలై 08 (తెలంగాణ వాణి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం నెన్నెల మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సేకరించి, వాటిని త్వరితగతిన డిజిటలైజ్ చేయాలని సూచించారు. వాలంటీర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సహకారంతో ఓటర్లకు ఫారాల నమోదు విధానంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మందమర్రి, నెన్నెల, బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించిన అదనపు కలెక్టర్, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులు, భూ సేకరణ అంశాలు, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో ఒక కేంద్రానికి 1,200 మందికి మించకుండా





చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర భూ సేవలను వేగవంతంగా అందిస్తున్నామని పేర్కొన్న ఆయన, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి సర్టిఫికెట్లను నిర్ణీత గడువులో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టాస్క్ ద్వారా ముగ్గురు జిల్లా వాసులకు ఉద్యోగాలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 08 (తెలంగాణ వాణి):**
నిరుద్యోగ యువతకు టాస్క్ కేంద్రంగా వివిధ సాంకేతిక కోర్సులలో అందిస్తున్న శిక్షణ ద్వారా జిల్లాకు చెందిన ముగ్గురికి క్యాంపస్ ప్లేస్మెంట్ లో ఉద్యోగాలు లభించాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన జి. కావ్య, ఎమ్. అంజలి, కె. సాయివాణి లు అత్యున్నత



ప్రతిభ కనబరిచి టిసిఎస్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఎంపికై ఉద్యోగాలు పొందడం అభినందనీయమని తెలిపారు. టాస్క్ కేంద్రంగా అందిస్తున్న శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతగా పాలాభిషేకం

**చర్లలో సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం**



**చర్ల, జూలై 8 (తెలంగాణ వాణి):**
రైతు భరోసా పథకం కింద రైతులకు రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని విడుదల చేసిన సందర్భంగా చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రైతు భరోసా వంటి పథకాలు వ్యవసాయానికి చేయూతనిస్తున్నాయని అన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోడి చలపతి, ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కారంపూడి సాల్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇటుక బట్టీలపై ఆకస్మిక తనిఖీ**



**జగిత్యాల: జులై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలోని వీఆర్‌కే కాలేజ్ సమీపంలోని ఇటుక బట్టీని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితిని పరిశీలించి, బాలలను పనిలో నియమించారా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, సురక్షిత బాల్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని, వాటిని హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని చిన్నారులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను హోటళ్లు, టీ దుకాణాలు, గ్యారేజీలు, వర్క్‌షాప్‌లు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, గృహ సేవలు లేదా ఇతర ఉపాధి రంగాల్లో పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాలకార్మికులు, వీధి బాలలు, తప్పిపోయిన చిన్నారులు, బలవంతపు శ్రమకు గురవుతున్న పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి విద్య, వైద్యం, పునరావాసం కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినా లేదా బలవంతపు శ్రమకు గురవుతున్న చిన్నారుల సమాచారం తెలిసినా వెంటనే డయల్--100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్--1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అనిల్ కదం, డీసీపీఓ సురేశ్, ఎస్ఐ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**జగిత్యాల: జులై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల పట్టణానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.3.60 లక్షల విలువైన చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. సీఎం సహాయ నిధి పేద, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
- **బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



**జగిత్యాల: జులై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ బుధవారం బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే స్పందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే శాంతిభద్రతలు పరిరక్షించబడతాయని చెప్పారు.ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొంటూ, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శించాలని, గ్రామాల పరిస్థితులపై పూర్తి సమాచారం కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సోషల్ మీడియా లేఖపై బీజేపీలో దుమారం.

### రాష్ట్ర అధ్యక్షుడిని ఆశ్రయించిన శంకర్ బాబు

**హుస్నాబాద్, జూలై 08(తెలంగాణ వాణి ఆర్ సి)**



హుస్నాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా తనను తొలగించినట్లు సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన లేఖపై బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పేరుతో తనను పట్టణ అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయాన్ని రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినట్లు శంకర్ బాబు తెలిపారు. దీనిపై స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఆ లేఖ విషయం తన దృష్టికి రాలేదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపైనాచర్యలుఉంటాయని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇలాంటి ప్రచారాలను పట్టించు కోకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ బాబు ను కోరారు.

# కల్తీ నూనెలు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

**-- మున్సిపల్ కమిషనర్**

**జమ్మికుంట, జులై 8, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో పాత మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ కల్తీ నూనెలు లేదా పలుమార్లు వాడిన వంట నూనెను ఉపయోగించరాదని సూచించారు. పామాయిల్‌కు బదులుగా డబుల్ ఫిల్టర్ పల్లి నూనె లేదా సన్‌ఫ్లవర్ నూనె వంటి నాణ్యమైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని తెలిపారు.సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు ఇవ్వకూడదని, ఆకులు లేదా పర్యావరణహిత పాత్రల్లో మాత్రమే ఆహారాన్ని అందించాలని



సూచించారు. టీ స్టాళ్లలో టీని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని తెలిపారు.వారం రోజుల తర్వాత ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు లేదా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ.1,000 నుంచి రూ.2,000 వరకు జరిమానా విధించడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బజ్జీ బండ్లు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా



చేతులకు గ్లౌజులు, తలకు హెడ్ క్యాప్, ముఖానికి మాస్క్ ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, సదానందం, హోటల్ యజమానులు, బజ్జీ బండ్ల నిర్వాహకులు, తోపుడు బండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు

**హుస్నాబాద్ జూలై 08 (తెలంగాణ వాణి ఆర్ సి)**
హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిఘననివాళు లర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్‌కు హుస్నాబాద్ ప్రాంతంతో ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2004 లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడిన చారిత్రాత్మక పాదయాత్ర సందర్భంగా వైఎస్సార్ హుస్నాబాద్‌కు వచ్చి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని తెలిపారు. అలాగే మాజీ కేంద్ర మంత్రి గులాం నబీ ఆజాద్‌తో కలిసిహుస్నాబాద్ లో బస్సు యాత్ర కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. హుస్నాబాద్ ప్రజల సమస్యలపై వైఎస్సార్‌కు పూర్తి అవగాహన ఉండేదని, హుస్నాబాద్ ప్రజల గుండెచప్పుడు లబ్ డబ్ కాదు గౌరవెల్లి ప్రాజెక్టు వరద కాలువ అంటూ ఈ ప్రాంత సాగునీటి అవసరాన్ని స్పష్టంగా ప్రస్తావించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన అనంతరం హుస్నాబాద్‌కు వచ్చి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసారని తెలిపారు. వరద కాలువ ద్వారా హుస్నాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ప్రత్యేకచర్యలుతీసుకున్నారని గుర్తుచేశారు.హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధిపై వైఎస్సార్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించారని కొనియాడారు.



ఈ ప్రాంతాని కి చెందిన దివంగత బొమ్మ వెంకటేశ్వర్లు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, ప్రస్తుత రాష్ట్ర మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌లతో వైఎస్సార్‌కు సన్నిహిత సంబంధాలు ఉండేవని పేర్కొన్నారు.వైఎస్సార్ ప్రజానాయకుడి గానే కాకుండా ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. మాట ఇచ్చి మడమ తిప్పని నాయకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక చారిత్రాత్మక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడంతో పాటు 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, 104 మొబైల్ వైద్య సేవలను ప్రారంభించి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి వేలాది మంది ఇంజినీర్లు, డాక్టర్లు, ఇతర వృత్తి నిపుణులుగా ఎదగడానికి అవకాశం కల్పించారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడంతో పాటు వృద్ధులకు పెన్షన్లు పెంచారని చెప్పారు.అపర భగీరథుడి గా పేరుగాంచిన వైఎస్సార్ తన హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 74కు పైగా సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారని అన్నారు. ఆయన ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను తరువాతవచ్చినప్రభుత్వాలు కూడా కొనసాగించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.వైఎస్సార్ ఆశయాలు, సేవలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవకుఅంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన ప్రభుత్వం కూడా వైఎస్సార్ సంక్షేమ భావజాలాన్ని కొనసాగిస్తూ ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎండి. హసన్, పట్టణ, మండల అధ్యక్షులువి.వెంకటరమణ ,వెన్నరాజు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ, మహిళా నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

**ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, జులై : 08 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదిలాబాద్ జిల్లాలోని పలు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. నిందితుడి వివరాలు: కొలాయం కాశీనాథ్ (19), తండ్రి రాజ్‌కుమార్,కంప్యూటర్ ఆపరేటర్, దస్నాపూర్, ఆదిలాబాద్. జల్సాలకు అలవాటు పడి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆలయాలనే లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. ఈరోజు ఆదిలాబాద్ పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించాడు. వెంటాడి పట్టుకుని విచారించగా తాను పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలిందని తెలిపారు. విచారణలో నిందితుడు మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తేలిందన్నారు. మార్చి నుంచి జూలై వరకు ఆదిలాబాద్ పట్టణం, భీంపూర్, తలమడుగు మండలాల్లోని పలు ఆలయాల్లో హుండీ నగదు, వెండి కళ్ళు, వెండి నామాలు, వెండి చేతులు, వెండి విగ్రహాలు, బంగారు పుస్తెలు, బంగారు గుండ్లు, ఇత్తడి గంటలు, హారతి పళ్లాలు తదితర వస్తువులను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. చోరీ చేసిన బంగారం, వెండి వస్తువులను ఆదిలాబాద్ అశోక్ రోడ్డులోని బంగారు వ్యాపారి లోకాజీ విశ్వనాథ్



వద్ద విక్రయించేవాడని, చోరీ సొత్తు అని తెలిసినా కొనుగోలు చేసినందుకు అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 30 తులాల వెండి ఆభరణాలు, 2.5 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి కళ్ళు (2), వెండి నామం (1), హోండా షైన్ మోటార్ సైకిల్ (టీజీ 01 1828), రెండు మొబైల్ ఫోన్లు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆలయాలు, ప్రార్థనా స్థలాల్లో చోరీలకు పాల్పడే వారిపై, అలాగే చోరీ సొత్తు కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ప్రణయ్, పోలీసు సిబ్బంది భూపతి నరేష్, క్రాంతి, కిషన్, సిసిఎస్ బృందం, పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఎక్కువ శాతం ఓట్లను నమోదు చేయించాలి



**రాజపేట జూలై: 08(తెలంగాణ వాణి విలేకరి)**
రాజపేట మండల కేంద్రంలో బీర్ల ఐలయ్య ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డి సి సి అధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా ఆదేశాల మేరకు సర్ ఓటర్ నమోదు బిఎల్ఎ కార్యక్రమం ప్రతి ఒక్క బూత్ లో గతంలో ఉన్నటువంటి ఓట్లను మరి కొత్త ఓటులను నమోదు చేయడంలో కీలకంగా వివరించుకుంటూ 10 బూతులకు ఒక కన్వీనర్ కోఆర్డినేషన్ చేసుకుంటూ ప్రజలను వారి ఓట్లను నమోదు చేయించుకోగలరనీ సర్పంచులు ఉప సర్పంచ్ వార్డ్ నెంబరు తో ప్రతి ఇంటింటికి వెళ్లి చేయాల్సిన బాధ్యత మన పైన ఉందని మండల ముఖ్య నాయకులు గ్రామాలలో తిరుక్కుంటూ మన రాజపేట మండలం అత్యధికంగా ఓట్లు చేర్పించాల్సిందిగా బాధ్యత మనపై ఉందని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా ఏ ఎంసి మండల గ్రామ నాయకులు యూత్ కాంగ్రెస్ అన్ని విభాగాల మీడియా కో ఆర్డినేటర్లు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాతా, శిశు మరణాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జులై : 08 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



జిల్లాలో మాతా, శిశు మరణాలను సున్నాకు తగ్గించే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలు, మాతా, శిశు మరణాల నమోదుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణుల నమోదు నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి అవసరమైతే వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, మాతా, శిశు మరణాల ప్రతి ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి లోపాలను సరిదిద్దాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా వైద్య సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పుట్టిన శిశువులకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆశ కార్యకర్తలు తల్లులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలని, క్షేత్రస్థాయి సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్యాధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆసుపత్రుల పనితీరు, మౌలిక వసతులను పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో పీహెచ్‌సీల వారీగా నమోదైన మాతా, శిశు మరణాల వివరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య ఆరోగ్య శాఖ పనితీరును మరింత మెరుగుపరచి, మాతా, శిశు మరణాలు లేని జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి డా. సాధన, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, ప్రోగ్రామ్ అధికారి వై.సి. శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## వెనుక నుంచి బైక్ ఢీకొని వ్యక్తి మృతి



**జహీరాబాద్/ఝరాసంగం: జూలై 08(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఝరాసంగం మండలం కుప్పా నగర్ గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గినియారపల్లి గ్రామానికి చెందిన తలారి విఠల్ (48) మృతి చెందారు. జహీరాబాద్ నుంచి ఝరాసంగం వైపు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్‌లో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఎస్సై క్రాంతి పాటిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హుస్నాబాద్ అమరుల స్థూప స్థల సాధన కమిటీ ఏర్పాటు...

**హుస్నాబాద్, జూలై 08(తెలంగాణ వాణి ఆర్.సి)**

హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి భవనంలో బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్,బి ఎస్ పి పార్టీ ప్రతినిధులతో పాటు వివిధ ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్రమించబడిన అమరుల స్థూపం స్థలాన్ని పరిరక్షించి తిరిగి సాధించేందుకు అన్నిరాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల భాగస్వామ్యం తో హుస్నాబాద్ అమరుల స్థూప స్థల సాధన కమిటీ"ని ఏర్పాటు చేశారు.కమిటీ ఛైర్మన్‌గా కవ్వ లక్ష్మారెడ్డి, కో-ఛైర్మన్‌లుగా గడిపే మల్లేష్, ఎంఏ. అన్వర్, జెరిపోతుల ఆంజనేయులు, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మేకల వీరన్న యాదవ్, కార్యదర్శులుగా గూడెం లక్ష్మి, తోడేటి రమేష్, బండి పుష్ప, జంగ




విజయ, గజవెల్లి మురళి, పెట్టెం కుమారస్వామి, ప్రచార కార్యదర్శులుగా గాదెపాక రవి, ద్యాగల సారయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి చారిత్రాత్మక చిహ్నమైన అమరుల స్థూపం స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూకాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని చట్టబద్ధంగా తిరిగి సాధించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులు, ప్రజలు ఐక్యంగా పోరాటం సాగించాలనిపిలుపునిచ్చారు. అవసరమైతే ఉద్యమ కార్యాచరణను మరింత ఉధృతంచేస్తామని,అమరుల త్యాగాలకు గుర్తుగా నిలిచిన స్థూపం స్థల పరిరక్షణ కోసం నిరంతరంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కమిటీ కార్యనిర్వాహక సభ్యులుగా గాజాగిరి సత్యనారాయణ, నాంపల్లి సమ్మయ్య, పెద్ది నిర్మల, పూదరి రవీందర్, అయిలేని మల్లారెడ్డి, తిరుపతి నాయక్ వేల్పుల, శ్రీనివాస్, కోహెడ కొమురయ్య, దండుగుల ఎల్లయ్య, గూడ పద్మ, గంబీరపు మధు, జనగామ రాజకుమార్, అందే స్వామి, నాగేల్లి లక్ష్మారెడ్డి, కనుకుంట్ల శంకర్, బత్తుల బాబు, కళ్యాణ్, ఆదరి శ్రీనివాస్, చుంచు కుమారస్వామి, అందే అశోక్, బెక్కంటి సంపత్, కొడిముంజ లక్ష్మణ్ లను ఎన్నుకున్నారు.




## ఘనంగా మహానేత వైయస్సార్ జయంతి వేడుకలు

**ధర్మారం, జులై 7 ( తెలంగాణ వాణి)**

మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఒక నాయకుడు మాత్రమే కాదు పేద ప్రజల సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం చెప్పిన మహా నేత అని కొనియాడారు. ప్రతి పేద కుటుంబం సంక్షేమాన్ని తన బాధ్యతగా భావించి అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి లక్షలాది మంది ప్రాణాలను కాపాడారని, ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు బాటలు వేసి,108 అంబులెన్స్ 104 ఆరోగ్య సేవలు, జలయజ్ఞం, ఇందిరమ్మ గృహాలు,ఉచిత విద్యుత్, పావలా వడ్డీ,రైతు సంక్షేమ కార్యక్రమాల వంటి ఎన్నో ప్రజాహిత పథకాలతో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కే నర్సింహులు, కే రవీందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లు కె సూర్యనారాయణ, పి రాజేశం, ఉప సర్పంచ్ ఏ మల్లేశం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బి స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్ తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ లు కే రాజేశం,ఇ శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి టి రాజ లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ ఓ శంకరయ్య, నాయకులుఓ చిరంజీవి,టి తిరుపతి, డి లావణ్య, కె ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



**జమ్మికుంట, జులై 8,( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జమ్మికుంటలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటీకరణ, రైతు వ్యతిరేక విధానాలు, విద్యా--వైద్య రంగాల నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేటు విద్యా, వైద్య సంస్థల ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే జమ్మికుంట పట్టణంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, నాయిని చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేసి హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతానికి సహకరించాలి

### రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పిలుపు



**ములుగు, జూలై 8 (తెలంగాణ వాణి)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 98.96 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, 25.79 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయ్యాయని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ, సేకరణ చేపడుతున్నారని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బీఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూలై 24న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రైల్వే ప్రాజెక్టుల భూసేకరణపై కేంద్రం సమీక్ష

### వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, జూలై 8 (తెలంగాణ వాణి):**



కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో చేపట్టిన నీటి పారుదల, రైల్వే ప్రాజెక్టులు, కాజీపేట--విజయవాడ మూడో రైల్వే లైన్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, కాజీపేట--విజయవాడ మూడో రైల్వే లైన్ విద్యుదీకరణ ప్రాజెక్టు కోసం ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 0.786 హెక్టార్ల భూసేకరణను 2026 మే నెలలో పూర్తి చేసినట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్డీసీ సదానందం, సంబంధిత శాఖల అధికారులు, భూసేకరణ విభాగ అధికారులు పాల్గొన్నారు.



## మాలపల్లి గ్రామ అభివృద్ధి పనులను సమీక్షించిన ఎంపీడీఓ సురేష్

**హుస్నాబాద్ రూరల్ జూలై 8(తెలంగాణ వాణి )**

హుస్నాబాద్ పరిధిలోని మాలపల్లి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ సురేష్ విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎస్ఐఆర్, కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ , బీఎల్ఏ సూపర్వైజర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల హక్కులను కాపాడేలా బాధ్యతగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పరిపరిశుభ్రత అనేది కేవలం అధికారుల బాధ్యతే కాదని, ఊరిలో నివసించే ప్రతి ఒక్కరిపై ఆ బాధ్యత ఉందన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సీసీ రోడ్లు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, ఓపెన్ జిమ్, డంపింగ్ యార్డులను ఎంపీడీఓ సందర్శించారు.అలాగే నూతనంగా నిర్మాణం కానున్న 'న్యాక్' (ఎన్ ఏ సి ) సెంటర్ స్థలాన్ని ఆయన పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని అధికారులకు



సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాజ్ కుమార్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మామిడి తిరుపతి, నాయకులు భూక్య రమేష్ నాయక్, హనుమండ్ల శ్రీకాంత్ రెడ్డి, బీఎల్ఓ సరోజన, బీఎల్ఏ వెన్న మల్లికార్జున్, వెన్న శ్రీరామ్, ఈజీఎస్ మేట్లు వెన్న శ్రీమతి, బత్తుల రాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నూతన తహసీల్దార్ సుధాకర్‌ను శాలువాతో సన్మానించిన మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి

**జమ్మికుంట, జులై 8, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**

జమ్మికుంట తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ను మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నూతన బాధ్యతల్లో తహసీల్దార్ సుధాకర్ విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్ ఐ భాస్కర్, శ్రీనివాస్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వనపర్తి : జులై 8, (తెలంగాణ వాణి )**

వనపర్తి జిల్లా కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హిందూ వాహిని కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ధర్నా సందర్భంగా పోలీసులకు, హిందూ వాహిని కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ, విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదే విధంగా, ధ్వంసమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం స్థానంలో ప్రభుత్వం తక్షణమే నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు వాహిని నాయకులు శివచరణ్, విశ్వహిందూ పరిషత్ హర్షవర్ధన్, బిజెపి జిల్లా ప్రధాన



కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్,హిందు వాహిని కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## నేడు సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

**ధర్మారం, జులై 8 (తెలంగాణ వాణి)**



నేడు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఐడిఓసిలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జీపిడీపి పై జిల్లా స్థాయి ఓరియంటేషన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేముల సుమలత తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు మేరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

## ఏటీసీ సెంటర్ భూమి పూజకు ఏర్పాట్లు

### 10న రాష్ట్ర మంత్రులు పొన్నం, వివేక్ చేతుల మీదుగా శంకుస్థాపన



**హుస్నాబాద్,రూరల్ జూలై 8తెలంగాణ వాణి )**

హుస్నాబాద్ మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామపంచాయతీ తోటపల్లి రెవెన్యూ శివారులో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారు.మంత్రుల పర్యటన నేపథ్యంలో నిర్మాణ ప్రాంతంలో స్థలాన్ని చదును చేసే పనులను కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన చేపట్టారు. బుధవారం ఈ ఏర్పాట్లను ఏటీసీ సెంటర్ ప్రిన్సిపల్, సైట్ ఇంజనీర్, గాంధీనగర్ సర్పంచ్ పోలు సంపత్, హుస్నాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ బంక చందు తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రి రోగులను మభ్యపెట్టి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తే కఠిన చర్యలు

**మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య**

**భద్రాచలం జులై 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

బుధవారం భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రవాణా శాఖ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రైవేట్ అంబులెన్స్ యజమానులు, డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మభ్యపెట్టి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రోగులను తప్పుదోవ పట్టించి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించడం, రోగులు లేదా వారి కుటుంబ సభ్యుల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అధిక అంబులెన్స్





ఛార్జీలు వసూలు చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి ముందు అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఫారూక్, రాజశేఖర్ రెడ్డి ప్రైవేట్ అంబులెన్స్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సి), ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం (పి యూ సి ), డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు తదితర పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏఎంవీఐలు ఫారూక్, రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ, ఇప్పటికే అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని, అంబులెన్స్ సేవలను నైతిక విలువలు, చట్ట నిబంధనలకు అనుగుణంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రవీణ్, నవీన్, హోం గార్డు భీముడు, అంబులెన్స్ యజమానులు జస్వంత్, రామకృష్ణ, డైవియా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీ వీల్స్ తో రోడ్లపైకి వచ్చిన ట్రాక్టర్‌కు జరిమానా -ఎస్సై

**ధర్మారం, జులై 7 (తెలంగాణ వాణి )**

వ్యవసాయ పొలాలలో దున్నడానికి ఉపయోగించే ఇనుప కేజీవీల్స్ తో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇనుప కేజీవీల్స్ తో రోడ్డు పైకి వచ్చిన ట్రాక్టర్ ను ఎస్సై ప్రత్యక్షంగా పట్టుకొని జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ డ్రైవర్లు ఇనుప కేజీవీల్స్ తో రోడ్లపైకి వస్తే బీటి, సిసి రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలుగా మారుతాయని, రోడ్లు పాడవడం వల్ల ద్విచక్ర వాహనాదారులు ఇతర ప్రయాణికులకు తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అలాంటి ట్రాక్టర్ల పై జరిమానా తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.



## ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రను అడ్డుకోవాలి : మడిపల్లి గోపాలరావు




**మధిర, జూలై 8 (తెలంగాణ వాణి):**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించి అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పిలుపునిచ్చారు. మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో గామాసు జోగయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అలాగే ఎస్ఐఆర్ విధుల్లో అంగన్‌వాడీ తదితర స్కీమ్ వర్కర్లపై అదనపు పనిభారం మోపడం సరికాదని, ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్,నల్లమోతు హనుమంతరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు,దూదిగం బసవయ్య, కూడెల్లి నాగేశ్వరరావు,లగడపాటి అప్పారావు, చిత్తారి కిషోర్,షేక్ మస్తాన్వలి,కొండేపాటి శివయ్య, గొబ్బురి కృష్ణంరాజు,పొట్టేటి వెంకటనారాయణరెడ్డి, తాళ్లూరు వెంకట నారాయణ,వేముల వెంకటేశ్వరరావు, కన్నెబోయిన శ్రీనివాసరావు,బి శ్రీను,మేకల పుల్లయ్య,షేక్ మొద్దిన్, తదితరులు, పాల్గొన్నారు



# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్

ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.




# ఇక నుంచి అలాంటి సినిమాలే చేస్తా

## కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాతృత్వం తర్వాత తనలో వచ్చిన మార్పులను ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాల విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత ప్రతి కథను అతడి కోణంలోనే ఆలోచిస్తున్నానని కాజల్ చెప్పారు. భవిష్యత్తులో తన తల్లి మంచి సినిమాలు చేసిందని కొడుకు గర్వంగా చెప్పుకునేలా ఉండే కథలనే ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందుకే నటనకు ప్రాధాన్యం ఉన్న, మంచి సందేశం ఇచ్చే సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. 'రామాయణ'లో మండోదరి పాత్ర పోషిస్తున్నానని చెప్పగానే నీల్ ఎంతో ఆనందపడ్డాడని కాజల్ తెలిపారు. అతడికి రామాయణ కథలు, ముఖ్యంగా రావణుడి పాత్ర అంటే చాలా ఇష్టమని చెప్పారు. ఈ సినిమా రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్ థియేటర్‌లో చూసే తొలి చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వల్ల కలిగే ప్రమాదాలను ఈ చిత్రం చూపిస్తుందని చెప్పారు. ఈ సినిమా కోసం చేసిన అధ్యయనం తన వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని, కుటుంబ సభ్యుల ఆహారపు అలవాట్ల విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని కాజల్ వెల్లడించారు.



# నా అందాలు దాచేసుకున్నా

## నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి

గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి - పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది.ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.



# సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavani1@gmail.com